# ఎక్కడైనా ఒకటే

వాళ్ళిద్దరూ ఆఖరుసారి సూరయ్యగారి గొడ్లసావిడి వెనక చింతచెట్లమధ్య కలుసుకున్నారు. అప్పటికి పొద్దూకి గంట అయింది. కనుచీకటిపడే సమయంలో శేషు అక్కడికి చేరి, పెద్ద చెట్టెక్కి కొమ్మల్లో కూచుని, రత్తమ్మకోసం ఎదురుచూడసాగాడు. ఎంతో సేపటికిగాని రత్తమ్మరాలేదు. నడ్డి ఆడించటాన్నిబట్టి చీకట్లోకూడ శేషు రత్తమ్మను పోల్చుకోగలిగాడు. తాను చెట్టుమీద ఉన్నట్టు గుర్తుగా సన్నగా ఈలపాట పాడాడు.

రత్తమ్మ చెట్టుచాటుకువచ్చి పైకిచూసి, "నువ్వొచ్చి శానా సేపయిందా?" అన్నది.

"కాలా మరీ?" అన్నాడు శేషు చెట్టుకొమ్మనుంచి వేళ్ళాడి, చేతులు వొదిలేస్తూ.

"ఏంటి మరిప్పుడూ?" అన్నది రత్తమ్మ.

"నువే చెప్పు. ఇంతకీ ఏం జేయదలిచా?"

"నేనేం జేసేదీ, నా బూడిదా!మా అయ్య సచ్చినా ఒప్పుగోడు_"

"అయితే నేను రైలుకింద బడాల్సిందే?"

"ఛా! ఊరుకో." రత్తమ్మ తన మునివేళ్ళతో శేషు గుండెలమీద ఆపేక్షగా తడివింది. తరవాత శేషుకు దగ్గరగా జరిగి నిలబడింది.

వాళ్ళిద్దరికీ జీవితంలో ఒకటే కోరిక --- పెళ్ళాడాలని. కాని అది జరిగేదికాదు. ఆ అల్పప్రాణుల సుఖానికి అవాంతరంగా వాళ్ళకు మించిన శక్తులున్నాయి. రత్తి తండ్రిని ధిక్కరించలేదు. రత్తి తండ్రికి ఎదురుతిరిగి శేషు ఆ ఊళ్ళో బతకనూలేడు.

ఈ అల్పప్రాణులు ఎంతసేపు మాట్లాడుకున్నా ఒకరిమీద ఒకరు ప్రమాణాలు చేసుకోగలరు; అమాయకమైన తమ ప్రేమను వాళ్ళకు అర్థమయే భాషలో వ్యక్తం చేసుకోగలరు; ఒకరికోసం ఒకరు కొట్టుకుపోగలరు. అంతే తప్ప తమ మధ్యఉండే అగాధంమీదుగా దూకలేరు.

"మనం ఒక్కసారన్నా నిజంగా సుకపడలేదు రత్తీ-ఎవరూలేరు, ఏమంటావ్?" అన్నాడు శేషు రహస్యంగా.

"ఓరమ్మో. ఇంకేమైనావుందా?" అన్నది రత్తి అతనిపట్టులో పెనుగులాడుతూ.

"ఒక్కసారి, రత్తీ!....ఆ తరవాత రైలుకింద పడిపోతా!" అన్నాడు శేషు.

రత్తి ఏడిచింది. ఎట్లా ఓదార్చాలో శేషుకు చాతకాలేదు.

"ఊరుకో! ఇంతమాత్రానికే చస్తారా ఏం? అట్లా అనిపిస్తాదిగాని!" అన్నాడు శేషు.

"నా పెళ్ళయినాక నువేం జేస్తావో చెప్పు. చెప్పక పోతే నన్ను చంపుకుతిన్నట్టే!" అన్నది రత్తి.

"ఏదో నా యేడుపు నేనేడుస్తా."

"అంత వొట్టేసినా చెప్పవా?"

శేషు ఆరాటపడ్డాడు. వాడికి మాట్లాడాలని లేదు.

"పట్నం వెళ్ళిపోతా గత్తీ. సినిమాల్లో జేరతా !" అన్నాడు బలవంతాన.

"అక్కడ మంచి మంచి ఆడోళ్ళంతా ఉంటారు గావాలి!" అన్నది రత్తమ్మ అసూయతో.

"ఆళ్ళందర్నీ గంగలో పడనీ."

"వొళ్ళుమాత్రం జాగర్త గుంచుకో."

"నే నుంచుకోను!" అన్నాడు శేషు మంకుతనంగా.

కాస్సేపు ఇద్దరికీ ఏం మాట్లాడాలో తెలీలేదు.

"అయితే. వద్దంటావా?" అన్నాడు శేషు.

"అమ్మో!....ఇక నే నెల్లాలమ్మా! శానా సేపయింది ఇల్లొదిలి!"

ముందు రత్తమ్మే వెళ్ళిపోయింది. శేషు మనసంతా అంధకారంలో మునిగిపోయింది.

ఒక్కసారి—ఒక్కసారన్నా రత్తి తనని సుఖపెట్ట లేదన్న బాధే వాడికి మిగిలింది.

* * *

ఏడాది జరిగింది.

శేషు పట్నంలోచేరి, తిండికిమాడి, సినిమా కంపె నీలచుట్టూ తిరిగి ఎంతో కష్టపడ్డమీదట నౌకరుపని సంపా దించి చివరకు ఎక్స్ట్రావేషాలు వేసేమూకలో చేరాడు. ఇది కొత్త జీవితం, కొత్త జన్మ.

అకస్మాత్తుగా ఒకరోజు బస్సులో వాడికి రత్తి కని పించింది. వాడు మొదట గుర్తుపట్టలేదు. తరవాత గుర్తు పట్టాడుగాని తనకళ్ళను తానే నమ్మలేకపోయాడు. రత్తి ముందే వాణ్ణిచూసి ఉండాలి. ఎంతసేపుచూచినా తనకేసి చూడనేలేదు.

శేషు దిగాలిసినచోటు వచ్చింది. కాని వాడు దిగ లేదు. కండక్టరును పిలిచి, "చివరదాకా టిక్కట్టియ్యి" అని పావలాబిళ్ళ చేతిలో పెట్టాడు. మరి రెండు స్టాపుల అవ తల రత్తి దిగింది. ముందుసీటులోనుంచి ఎవడో కోర మీసాలవాడు లేచినిలబడి రత్తికి దిగమని సంజ్ఞచెయ్యటం శేషు చూశాడు.

బస్సు మళ్ళీ కదలబోతుండగా శేషుకూడా దిగాడు. రోడ్డుప్రక్కగా ఇద్దరూ నడిచిపోతున్నారు. రత్తి నడ్డితిప్పు కొంచెంకూడా మారలేదు. యాభై గజాలు వెనకగా శేషు వాళ్ళను అనుసరించి నడిచాడు.

మధ్యలో ఒకే ఒక్కసారి రత్తి వెనక్కుతిరిగి శేషు తనవెంట వస్తూండటం గమనించింది. రత్తి మొహంలో శేషుకు భయం కనిపించింది.

వాళ్ళు ఒక సందులోకి తిరిగి ఒక పాతకాలపు పెంకుటింట్లోకి దూరారు. వాళ్ళింటి ముందుగా నడచి అంత దూరానఉన్న సిగరెట్టు బంకుదగ్గరికి వెళ్ళి కానీ బీడీలుకొని, ఒకటి కొబ్బరితాటికి అంటించి ఆ ఇంటి వాకిలి కేసే చూస్తూ నిలబడ్డాడు.

శేషు మూడో బీడీ కాలుస్తుండగా మీసాలవాడు బయటికివచ్చి మళ్ళీ బస్ స్టాపి కేసి వెళ్ళాడు. శేషు వీధి మలుపుదాకా వెళ్ళి వాడు బస్సెక్కేసదాకా నిలబడి, పెంకుటింటికి తిరిగివచ్చి "ఎవరండి లోపలా?" అని అరిచాడు.

రత్తి లోపలినుంచి తొంగిచూసి, "శేషూ! రా లోపలికి." అన్నది.

"ఏంటిది, రత్తి? ఇక్కడెట్లావచ్చి పడ్డావు? నీ పెళ్ళి అయిందా?"

"లేదు. పెళ్ళి రేపనగా డబ్బుతీసుకొని పారిపోయి రైలెక్కా."

"ఎన్నాలయింది నువ్వొచ్చి?"

"కాలా ఆరేడు నెల్లు."

"ఏం జేస్తున్నావు?"

"సినిమాల్లో యేసాలేస్తున్నా చిన్నవేలే. ఈసారి మంచి యేసం ఇస్తారంట?" ఎక్స్ట్రావేషాలు వేస్తున్నానని శేషు కెందుకు చెప్పటం?

"ఎందులో?" అన్నాడు శేషు ఇంకోబీడీ ముట్టిస్తూ.

"అదేంవో పేరబ్బా! నువ్వు?"

"నేనుకూడా పిల్ల యీరోవేసాలేస్తున్నా. ఎప్పుడో పెద్ద యీరోజేస్తారంట!"

"పోనీలే, పాపం! బాగున్నావుగద!"

"నువ్వు?"

"బాగనేవున్నా శేషూ!"

"ఒక్కసారైనా మనం సుఖపళ్లేదు. రత్తీ! ఏవంటా?" శేషు గొంతులో వెనకటి దైన్యంలో కొంతైనా రత్తికి విని పించింది.

"అమ్మో! సంపెయ్యడూ?"

"అంతేనంటా? ఏడీ, పొయ్యాడుగా?"

"ఇప్పుడ్రాడూ?"

"అయితే నేనెళ్లి రానా?"

"మళ్ళీ అవుపిస్తాలే, శేషూ!"

"అట్టనేలే రత్తీ!"

శేషు బయటికొచ్చి బీడీ నేలకేసి విసిరికొట్టి తల పైకెత్తి గర్వంగా బస్‌స్టాప్ కేసి వెళ్ళాడు.

రత్తి కుళ్ళి కుళ్ళి ఏడవసాగింది. ఈ మీసాలవాడి పాలపడక ముందు నాలుగునెల్లు నానా అగచాట్లుపడి శేషు కోసం ఎందరినడిగిందో, ఎన్నిచోట్ల వెతికిందో రత్తమ్మ శేషుతో చెప్పనేలేదు.

ఎందుకు చెప్పటం? చెప్పుకుని చేసేదేముంది?

—౦—